## నేడు తీగుల్‌కు మాజీ మంత్రి హరీష్‌రావు రాక


మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, మే 31 (ప్రభాతవార్త):** ఈనెల 1వ తేదీ ఆదివారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హాజరవుతున్నారని, గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ బట్టు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేత

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** పట్టణంలో ఈనెల 2వ తేదీ సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి నిర్వహించే భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలను వేర్వేరుగా కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని కోరినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు.


ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం


కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందచేస్తున్న ఎంపి రఘునందన్‌రావు

## రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**-కేంద్ర సహాయ మంత్రికి ఎంపి రఘునందన్‌రావు వినతి**

**రామచంద్రాపురం, మే 31, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి రైల్వే స్టేషన్‌ను శనివారం కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి సోమన్న సందర్శించారు. హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని బీదర్ పట్టనానికి రైల్లో వెళుతున్న కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు ఎంపి రఘునందర్‌రావు ఈదులనాగులపల్లి రైల్వే స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకుని మంత్రిని ఘనంగా సన్మానించి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ఎంఐజి కాలనీ, తెల్లాపూర్ సాయిబాబా ఆలయం మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పూడికతో నిండుకుపోయిందని, ఫలితంగా సమస్యలు తెలెత్తుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకుపోయామన్నారు. అదనపు ఆర్‌యుబి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతి చేశామన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి సదుపాయాలులేవని, లోపాన్ని సవరించేందుకు 508 ఎకరాల భూమిని ఈదులనాగులపల్లి గ్రామంలో రైల్వే టెర్మినెల్‌కు ఈపాటికే కేటాయించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటి బిజెపి అధ్యక్షులు రాంబాబు గౌడ్, మాజీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు ఉన్నారు.

## నవోదయకు బొలెరో వాహనం అందజేసిన ఎంపి


బొలెరో వాహనాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న రఘునందన్‌రావు

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు శనివారం విద్యాలయ అవసరాలకై బొలెరో నియో వైట్ కలర్ వాహనాన్ని అందజేశారు. ఈ వాహనాన్ని హైదరాబాద్‌లో ఉన్న హెటరో కంపెనీ అధినేత పార్థసారథిరెడ్డి కార్పొరేట్ సామాజిక బాధ్యత అంశాన్ని ప్రాతిపదికగా తీసుకొని విద్యాలయానికి ఇవ్వడం జరిగింది. హెటరో కంపెనీ తరపున అరుణ్‌రెడ్డి పాల్గొని ఎంపి వాహనాన్ని విద్యాలయ ప్రిన్సిపాల్‌కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని గుర్తుంచుకోవాలని, పరిపూర్ణ వికాసానికై పాటుపడుతున్న నవోదయ విద్యాలయలో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశించారు. సిబిఎస్‌సీ బోర్డు పరీక్షల్లో తెలుగు, ఐపి సబ్జెక్టుల్లో వందశాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంపి జ్ఞాపికలు అందజేశారు. చక్కటి ఫలితాలకు విశేషంగా కృషిచేసిన టిజిటి తెలుగు అధ్యాపకులు ఎం. విజయ్‌కుమార్, పిజిటిఐటి జితేందర్‌కుమార్‌లను, పదవీ విరమణ చేయనున్న గణిత అధ్యాపకుడు వజ్జల శ్రీనివాసరావులను సన్మానించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ మాట్లాడుతూ విద్యాలయానికి వాహనం వచ్చేలా కృషి చేసిన ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యాలయానికి సోలార్ వాటర్ హీటర్స్ అందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో విశేష పాత్ర పోషించిన నాయకులు బాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ప్రిన్సిపాల్ కొనియాడారు.

## విధి నిర్వహణలో చిత్తశుద్ధి కలిగిన అధికారి ప్రభాకర్

**-పంచాయతీరాజ్ సీఈ జోగారెడ్డి**

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ప్రభాకర్ లాంటి అధికారులు చాలా అరుదుగా ఉంటారని పంచాయతీరాజ్ సీఈ జోగారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం వర్గల్‌లో జరిగిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు ఉపయుక్తమైన పనులకు ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం ప్రజా సంబంధాలను కలిగి ఉన్న ప్రభాకర్ నాణ్యతతో కూడిన పనులు చేపట్టి ప్రజల మెప్పు పొందినట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా 42 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రయాణంలో ఎంతో మంది కింది స్థాయి అధికారులకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ నరేందర్‌రెడ్డి, ఈఈ చిరంజీవిచారి, తహసీల్దార్లు రఘువీర్‌రెడ్డి, ఆరీఫా, ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎంపిడిఓ మశ్చేందరర్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ అంజిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ హరిత, వివిధ మండలాల మాజీ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాయకులు లతారమేష్‌గౌడ్, నిమ్మ రంగారెడ్డి, మోహన్, బాలుయాదవ్, విద్యాకుమార్, రామచంద్రం, అర్జున్‌గౌడ్, సింగం సత్తయ్య, బాల్‌రెడ్డి, పోచయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

* రికార్డుస్థాయిలో ధాన్యం సేకరణ
* ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, మే 31, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇల్లు, భూభారతి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలతోపాటు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి, టిజిఐఐ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఫాహీం పాల్గొన్నారు. మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనరసింహ, జిల్లాల వారీగా ఎజెండా అంశాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రజా సంక్షేమ పథకాలు అందాలన్నారు. రాష్ట్రం రికార్డు స్థాయిలో ధాన్యం పండించడంతోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నియోజకవర్గానికి 3,500 ఇండ్లు అదనంగా 20!! శాతం ఇండ్లు కేటాయించనున్నట్లు తెలిపారు రైతులకు ఎలాంటి ఎరువుల, విత్తనాల కొరత లేదని పూర్తిస్థాయిలో స్టాక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 95 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందన్నారు. అకాల వర్షంతో తడసిన ధాన్యాన్ని కొంటాం అని రైతు కళ్లంలో ఉన్న చివరి గింజ వరకూ సేకరిస్తాం అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా కరెంటు సమస్య రాకుండా చూడాలని అధికారం ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, ధాన్యం సేకరణ జరిపి ఇప్పటివరకు రూ. 250 కోట్ల రైతులు అకౌంట్ లో జమచేశామన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక చట్టం భూభారతి కొండాపూర్ మండలంలో పూర్తిస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించామని ఇప్పటివరకు 1718 దరఖాస్తులు వచ్చాయని వాటిని త్వరగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ గతంలోకంటే ఈ సీజన్ లో 29,000 వేల మెట్రిక్ టన్నుల అదనంగా ధాన్యం కొనుగోలు చేసామన్నారు. 555.79 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేగంగా చెల్లింపులు చేశామని అన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఇప్పటివరకు 3లక్షల 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 700 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోలో ఉమ్మడిజిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహలకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు.


గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలలో పాల్గొన్న హరీష్‌రావు

### కెసిఆర్ హయాంలోనే
## గంగపుత్రులు, మత్స్యకారుల అభివృద్ధి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట రూరల్, మే 31, ప్రభాతవార్త :** కెసిఆర్ హయాంలోనే గంగపుత్రులు, మత్స్యకారుల అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో గంగమ్మ దేవాలయ అమ్మవారి వార్షికోత్సవంలో శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు హయాంలో మత్స్యకారులకు లూనాలు, ఆటోలు, ఐస్ బాక్సులు పంపిణీ చేశారని గుర్తు చేశారు. కాలమైనా కాకపోయిన కాళేశ్వరంతో చెరువులు,కుంటలు నింపామన్నారు. రైతుబంధు, రైతు బీమా ఇవ్వడం లేదన్నారు. రాబోయే కాంలో బిఆర్ఎస్ రావాలని మళ్లి కెసిఆర్ సిఎంగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అలాగే నారాయణరావుపేట మండలం గుర్రాల గొందిలో నిర్వహించిన మహంకాళి అమ్మ దేవాలయం ఉత్సవాలలో పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు లింగారెడ్డి పల్లిలో గ్రామ దేవతల ప్రతిష్ట ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

### రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల
# నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**


రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణకు మైదానాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జూన్ 2న సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన గల క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే అతిథులకు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమాలన్ని ప్రోటోకాల్‌ను పాటిస్తూ షెడ్యూల్ ప్రకారం పక్కాగా నిర్వహించాలన్నారు. వర్షం కురిస్తే ఇబ్బందులు రాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ముస్తాబాద్ చౌరస్తాలోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ॥కొత్తపల్లి జయశంకర్ విగ్రహంను పరిశీలించి నివాళులర్పించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం రంగదాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్థూపాన్ని పరిశీలించి నివాళులర్పించడానికి ముస్తాబు చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా అదనపుకలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, కలెక్టరేట్ ఎవో రెహమాన్, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బి, సమాచార పౌర సంబందాలశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జూన్‌లోనే సన్న బియ్యం పంపిణీ చేయాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్,జూలై, ఆగస్టు 3 నెలలకు సంబంధించిన రేషన్ సన్న బియ్యాన్ని జూన్ మాసంలోనే ఒకే సారి లబ్దిదారులకు పంపిణీ చౌక ధరల దుకాణాలకు 3 నెలల బియ్యాన్ని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సిద్దిపేట మార్కెట్ యార్డులోగల మండల లెవెల్ స్టాక్ సెంటర్‌ను సందర్శించి అక్కడి నుంచి మండలాలలోని రేషన్ దుకాణాలకు లారీల ద్వారా సరఫరా అవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం సరఫరాచేయడానికి సరిపడా వాహనాలు సమకూర్చి హమాలీల కొరతలేకుండా చూసుకుంటూ లబ్దిదారులకు ఇబ్బందులు రాకుండా అన్ని దుకాణాలలో రేషన్ బియ్యం ఉండేలా చూసుకోవాలని సివిల్ సప్లై డిఎం ప్రవీణ్‌ను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పేదలు రేషన్ బియ్యం కోసం ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశ్యంతో 3 నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 686 చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. ఆయన వెంట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, తహశీల్దారు ఉన్నారు.


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆరీఫా

## మూడు నెలల బియ్యం ఒకేసారి అందజేయాలి

**-తహసీల్దార్ ఆరీఫా**

**ములుగు, మే 31 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం జూన్ నెలలోనే పంపిణీ చేయాలని తహసీల్దార్ ఆరీఫా పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని రేషన్ డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రేషన్‌డీలర్ మూడు నెలలకు సరిపడా బియ్యంవేసుకొని లబ్ధిదారులకు అందించాలన్నారు. అవసరమైన పాఠశాలలతరగతి గదులను ఉపయోగించుకోవా లని సూచించారు. ఈ విషయం అందరికి తెలిసేలా దండోరా వేయించాలని అన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**ములుగు, మే 31 (ప్రభాతవార్త):** భూభారతి రెవెన్యూ సదస్సులను ములుగు మండలంలో ఈనెల 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఆరీఫా తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులను మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలలో నిర్వహించడం జరుగుతుందని, రైతులకు సంబంధించి భూమి విషయంలో వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

## 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సు : ఆర్డీవో

**నర్సాపూర్ మే 31, ప్రభాతవార్త:** ఈ నెల 3 నుంచి నర్సాపూర్ డివిజన్ పరిలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఆర్డీవో కె మహిపాల్ తెలిపారు. శనివారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టం కార్యక్రమం లో భాగంగా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో అధికారులు చేపట్టవలసిన పలు సూచనలను సలహాలను ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ మేరకు మండల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో మహిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ విజయలక్ష్మి ౹, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముత్తాయిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా క్రిష్ణకుమార్ గౌడ్

**హవేళీఘణపూర్, మే 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ముత్తాయిపల్లి గ్రామ అధ్యక్షుడిగా కృష్ణకుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శేఖర్, కోశాధి కారిగా శ్రీనివాస్, బిక్షపతి, కిరణ్, ముస్తఫ, కుమార్ ఎన్నికయ్యారు.

## 116 రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**గుమ్మడిదల మే 31(ప్రభాతవార్త) :** గుమ్మడిదల మండలం ప్యారానగర్ నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన డంపింగ్ యార్డ్(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం 116 రోజుకు చేరింది. గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసి సస్యశ్యామలం, పచ్చని అటవీ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసి కాలుష్యం చేయకుండా కాపాడాలని మహిళలు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వేరే ప్రజలు నివాసం లేని ప్రాంతానికి తరలించాలని వారు వేడుకున్నారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి నల్లవల్లి జేఏసీ నాయకులు మహిళలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**గుమ్మడిదల మే 31(ప్రభాతవార్త) :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ రఘు శంకుస్థాపన చేశారు. అలాగే నల్లవల్లి, కొత్తపల్లి, కానుకుంట రామ్‌రెడ్డిబావి గ్రామాలలో మండల ప్రజాపరిషత్ అధికారి ఉమాదేవి ప్రారంభించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేరాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిమ్ముల నరసింహారెడ్డి, మూడు చింతల నరేందర్ రెడ్డి, తులసి దాస్, మహిపాల్ రెడ్డి, తుడుం శ్రీనివాస్, ఆకుల ఆంజనేయులు, కిరణ్ కుమార్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, బిక్షపతి, జైపాల్ రెడ్డి, కర్ణాకర్, నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల, ఏ ఈ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజు గౌడ్, రవి, శివ, శ్రీశైలం, నల్లవల్లి, పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

# సుల్తాన్‌పూర్ జెఎన్‌టియు వద్ద బాధితుల ఆందోళన

**-నష్టపరిహారం చెల్లించకుండా పనులెలా చేస్తారని పెట్రోల్ డబ్బాతో చేరుకున్న రైతు రవి**



పెట్రోల్ డబ్బాతో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తున్న రైతు రవి

**చౌటకూరు, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 40/ఇలోని 3.03 ఎకరాల భూమి వివాదాస్పదంగా మారింది. గ్రామానికి చెందిన గొల్ల మల్లేశంకు సర్వే నంబర్ 40/ఇలో 3.05 ఎకరాల పట్టా భూమితో పాటు మరో సర్వే నంబర్ 41లో ఎకరం 35 గుంటల లావాణి భూమిని 2012లో జేఎన్టీయూ నిర్మాణంలో కోల్పోయారు. అప్పట్లో సర్వే నంబర్ 41లోని భూమికి నష్టపరిహారం డబ్బులు పొందారు. అయితే 40/ఇలో భూమికి సైతం పరిహారం కింద 8 లక్షల 70 వేల 434 రూపాయలు మంజూరయ్యాయి. అయితే సదరు భూమిని భూసేకరణ పూర్తి చేసిన రెవెన్యూ అధికారులు 3.05 ఎకరాల భూమిని జేఎన్టీయూ పేరున బదలాయించడంతో తనకు జీవనాధారంగా ఉన్న భూమిని ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో పాటు కోర్టు మెట్లు ఎక్కి సదరు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ స్టేను సైతం తీసుకొచ్చాడు. రెవెన్యూ అధికారులు సదరు భూమిని మల్లేశం పేరుపై భూ మార్పిడి చేశారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల పేరున ఉన్న భూమిని రైతు మల్లేశం పేరుపైకి ఎలా మారుస్తారని కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోగా రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటును గుర్తించి సదరు భూమిని తిరిగి జేఎన్టీయూ కళాశాల పేరుపైకి మార్చారు.

సదరు భూమిలో నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలుసుకున్న రైతు మల్లేశం భార్య సాయమ్మ కుమారుడు రవి కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ డబ్బాతో సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్య యత్నం చేశారు. తమకు న్యాయం చేయకుంటే కుటుంబ సభ్యులందరం ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని రవి వాపోయాడు. విషయం తెలుసుకున్న సిఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పి కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు తీసుకుపోయి ఉద్యోగంపై చర్చలు జరిపారు.

## చిత్తారమ్మ బస్తీలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు

**కెపిహెచ్బి కాలనీ, మే 31, ప్రభాతవార్త**

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్, చిత్తార మ్మబస్తీ డబుల్ బెడ్ రూమ్ సైట్‌లో ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో గత మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా, పంచమి శుభముహూర్తంలో వైభవంగా ప్రతిష్ట మహోత్సవం కొనసాగుతోంది. ఇక్కడి ఆలయ నిర్మాణ దాత వడ్డేపల్లి రాజేశ్వరరావునీ ఘనంగా పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకుల వేద ఆశీర్వచనములతో ఆశీర్వదించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, ఆలయధ్వజారోహణం, శాంతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్ర మాల నిర్వహణ గురించి రాజేశ్వరరావు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రమేష్, డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కుమార్, రాజేందర్ ప్రసాద్, డివిజన్ నాయకులు వాణి నాయుడు, చంద్రప్రకాష్ రెడ్డి, నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, కన్నన్, పద్మారావు, రూప మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరైనారు.

## ఏఎస్ రాజు నగర్‌లో ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్



ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**కెపిహెచ్బి కాలనీ, మే 31, ప్రభాతవార్త**

నో టొబాకో డే సందర్భంగా ఏ.ఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియే షన్ ఆధ్వర్యంలో శనివారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్ స్టాఫ్ డా.శ్రావణి కుమారి, డా.ప్రభాకర్, డా. సాయి మనోజ్ రేడియాలజీ అంకాలజిస్ట్, సాయిబాబా వారు సం యుక్తంగా ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ సీనియ ర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొనీ స్క్రీనింగ్ టెస్ట్ చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియే షన్ కమిటీ సభ్యులు నర్సింహా నాయుడు, పీ.ఎస్ రాజు, నర్సింహా రెడ్డి, ఏకాంబరం కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడుగా మనోహర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త**

జాతీయరెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల (ఏపీ, టిఎస్) ఉపాధ్యక్షులుగా సైకం మనోహర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఓసీ సంక్షేమ సంఘం, రెడ్డి సంక్షేమ సం ఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్‌రెడ్డి తన కార్యాలయంలో నియమక పత్రాన్ని అందజేశారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మనోహర్‌రెడ్డి గత ఐదెండ్ల నుంచి వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతోపాటు వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రెడ్డి సామాజిక సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నేపథ్యంలో ఈ పదవిలో నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మ నోహర్రెడ్డి మాట్లాడుతూ పేదరెడ్డి సమస్యలతోపాటు ఓసీలో జరుగుతున్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతనన్నారు. రెండు రాష్ట్రాలలో రెడ్డి కార్పొరేషన్కు తగిన నిధులు కేటాయించి నిరుపేద రెడ్డిలను అదుకోవాలని ఆయ న కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సలిపెల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

**-బిఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్**

**గోషామహల్,మే 31ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిహెచ్ ఎంసి సర్కిల్ 14 డిప్యూటి కమీషనర్ దుబ్బాక లావణ్యను కలిసి వినతి పత్రం అందచేశారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షా కాలం కావడంతో నాళా,కచ్చామోరీల పూడికతీత పనులు వెంటనే చేపట్టి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి కారణంగా స్థానికప్రజలు అనేక ఇబ్బందులకు గురై అవకాశా లు ఉన్నట్లు తెలిపారు.ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుచర్యలు చేపట్టడంలో ఆనంద్‌కుమార్ డిప్యూటి కమీషనర్‌కు వినతిపత్రంలో అందచేశారు.కాగా విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ బేగంబజార్ డివిజన్ ట్రాన్స్‌కో డి.ఇ పర్వత్ అలీకి వినతి పత్రం అందచేశారు.బిఆర్ఎస్ నాయకుల స్థానిక ప్రజలతో కలిసి విద్యుత్ విభాగం అధికారులకు ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించిన ప్రాంతాలల్లో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో వర్షాలు కురిసి పృడల్లా నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలుతలెత్తకుండా చర్య లు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.అనేక ప్రాంతాలలో వివిధ కారణాల వల్ల విద్యుత్‌స్థంబాలు,ఒక వైపు వంగిపోగా,కొన్ని ప్రాం తాలల్లో వర్షం వచ్చినప్పుడల్లా కరెంట్ షాక్ కొడుతున్న విద్యుత్ స్థంబాలను తొలగించి నూతన స్దంబాలను ఏర్పాటు చేయాలని, కంచలేని ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచ ఏర్పాటుచేయాలని కోరారు. అధికారులను కలిసి వారిలోబిఆర్ఎస్ నాయకులు ప్రియాగుప్త, అహ్మద్,ముఖేష్,సుమన్‌కుమార్,విజయ్,దుర్గారాజ్ పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

కేశంపేట మే 31 ప్రభాతవార్త కేశంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమాన్ని కేశంపేట మాజీ సర్పంచ్ ఎన్నం శ్రీధర్ రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు జూలపల్లి అనసూయ ముదిరాజ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు, అనంతరం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని ప్రతి పేద రైతుకు ఇండ్లు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విద్యావతి, కారో బర్ రవి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

అత్తాపూర్ మే31,ప్రభాతవార్త : ఆరోగ్యం, ఆయుర్వేద ఉత్పత్తుల కంపెనీ డాబర్ ఇండియా వారికి చెందిన ప్యాకేజ్డ్ పళ్ల రసాలు, పానీయాల బ్రాండ్ అయిన రియల్ సంస్థ తన సరికొత్త ప్రచారాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. బాలీవుడ్ ప్రముఖ నటుడు సిద్ధార్థ మల్హోత్రా ఈ ప్రచారంలో పాల్గొన్నారు. వైస్ ప్రెసిడెంట్ మయాంక్ కుమార్ మాట్లాడుతూ,ఇటీవలి కాలంలో వినియోగదా రులు పూర్తిగా ఆరోగ్యంపై దృష్టిపెడుతున్నారు. చెప్పారు.

## క్యాన్సర్లపై మాట్లాడడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు : నారా బ్రహ్మణి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:**



దేశంలో మహిళలకు వచ్చే పలు క్యాన్సర్లపై చర్చించడా నికి మహిళలు మాట్లాడడానికి ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఏపీ మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రహ్మణి అన్నారు. శనివారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో రెండు రోజుల పాటూ గైనకాలజికల్ ఆంకాలజీ లైవ్ వర్క్ షాపును ఆమె జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలలో ఏర్పడే గైనకాలజికల్ క్యాన్సర్ మహమ్మారిగా మారి లక్షలాది కొత్త కేసులు నమోదు అవుతున్నాయని,ఈ క్యాన్సర్లపై ఇలాంటి వర్క్ షాపు నిర్వహించడం సంతోషదాయకమని చెప్పారు. తనకు వైద్యవిద్యపై ఎంతో ఆసక్తి ఉండేదని అయితే తాను వైద్యురాలు కాలేకపోయినా హాస్పిటల్ ద్వారా ఆ కోరిక తీరుతోందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల లో మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి మరిన్ని సమస్యలతో భాదపడుతున్నారని అన్నారు. వీరికి సరైన అవగాహన లేక ఎన్నో సమస్యలను దూరం చేసుకోలేక పోతున్నారని,మహిళలలో మరింత అవగాహన కలిపించ డానికి కృషి చేస్తామని చెప్పారు.మెడికల్ డైరెక్టర్ డా. టియస్ రావు మాట్లాడుతూ వైద్యులు తమ అనుభవా లను పంచుకోవడం ద్వారా రోగులకు మంచి చికిత్స అం దించగలుగుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వైద్యులు కొత్త మెళుకవులు తెలుసుకోవడమే కాకుండా వైద్య విధానాలలో అందుబాటులోనికి వచ్చిన ఆదునిక చికిత్సా పద్దతులను అర్థం చేసుకోవడానికి, నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా యువ వైద్యులకు ఇది మంచి అవకాశమని ఎంతో అనుభవం గడించిన వైద్యుల ద్వారా అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందని చెప్పారు.ఈ వర్క్ షాపులో గైనకాలజికల్ ఆంకాలజీలకు సంబంధించిన శస్త్ర చికిత్సలను డా. ఆర్ రాజగోపాలన్, సర్జికల్ ఆంకాలజిస్టు నేతృత్వంలో సర్జికల్ ఆంకాలజిస్టులు డా.సుజిత్ పట్నా యక్, రాహుల్ సూరపనేని, డా.సృజన్ సందేశ్ శుక్లా, డా.జేబా ఉసేఫి బృందం చేస్తున్న శస్త్ర చికిత్లను నేరుగా ఆపరేషన్ థియేటర్ నుండి లైవ్‌గా చూపించి దానిని వివరించడం, దానిపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ట్రస్ బోర్డు సభ్యులు డా. టియస్ రావు, మెడిక ల్ డైరెక్టర్,ఫణికోటేశ్వరరావు, మెడికల్ సూపర్నిం టెండెంట్, డా. కల్పనా రఘునాథ్, అసోసియేట్ డైరెక్టర్ - అకడమిక్స్, డా. రాజగోపాల్, సర్జికల్ ఆంకాలజిస్టుల తో పాటూ పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీవేంకటేశ్వరస్వామి షోడశ వార్షిక అధ్యయన బ్రహోత్సవాలు

**నాంపల్లి, మే 31 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదా య ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లో ఉన్న శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి షోడశ వార్షిక అధ్యయన బ్రహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వ హించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. జూన్ 3 మంగళవారం నుండి 8 ఆదివారం వరకు వైభవోపేతంగా స్వామివారికి నిర్వర్తించే విశేష కైంకర్య విలురాలను తెలిపారు. 3 మంగళవారం రాత్రి 7గంటల నుండి ప్రబంధ పారాయణం; 4 బుధవా రం ఉదయం 7గంటల నుండి సేవాకాలం, రాత్రి 7గంట ల నుండి పరమ పదోత్సవం; 5 గురువారం ఉదయం 8గంటలకు ఉత్సవారంభ స్వపనము, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, చతు ష్టానార్చన, ధ్వజాది హోమం, ధ్వజారోహణం; రాత్రి 7గంటల నుండి నిత్యహోమం, బేరీపూజ, దేవతాహ్వా నము, నిత్యపారాయణాదుల ప్రారంభం; 6 శుక్రవారం ఉదయం 9గంటల నుండి నిత్యహోమం, శ్రీలక్ష్మీ సుదర్శ నయాగం, ఎదుర్కోలు ఉత్సవం, నిత్యహోమం; రాత్రి 7గంటల నుండి నిత్యహోమము, రథోత్సవం, శ్రీవారి కళ్యాణోత్సవం; 7 శనివారం ఉదయం 9గంటలకు మహ పూర్ణాహుతి, చక్రస్నానము, కుంభ ప్రోక్షణ; రాత్రి 5గంట లకు శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాపన, ధ్వజారోహణం, రాత్రి 8గంటలకు డోలోత్సవం, కార్యక్ర మ పరిసమాప్తి, పండిత సన్మానం, వేద ఆశీర్వచనం; 8 ఆదివారం ఉదయం 8గంటల నుండి శతఘటాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని అధికసంఖ్యలో భక్తు లు విచ్చేసి ఆయా కైంకర్యాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## లక్ష్మీగణపతి ఆలయం అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి కాశీనాథ్‌శర్మ

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:** నాలుగుదశాబ్దాలకుపైగా సుదీర్ఘకాలం పాటు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాల యం అర్చకుడిగా పనిచేసిన వ్యక్తి కాశీనాథ్‌శర్మ అని ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సిం గరావు అన్నారు. శనివారం లక్ష్మీగణపతి దేవాలయంలో ప్రధాన అర్చకుడిగా పదవీ విరమణ పొందిన కాశీనా థ్‌శర్మ అభినందన సత్కార సభ జరిగింది. ఆలయం సమగ్రాభివృద్ధికి ప్రధాన అర్చకుడిగా విశేషంగా కృషి చేసిన వ్యక్తి కాశీనాథ్‌శర్మ అన్నారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి పలువురి ప్రశంసలు అందుకున్న ఇ.కాశీనాథ్‌శర్మ అభినందనీయులు అని అన్నారు. ఆల యానికి సంబంధించి దూపదీపనైవేద్యాలు, గణపతి నవరాత్రోత్సవాలు, ఆలయానికి సంబంధించి దాతల నుంచి విరాళాలు సేకరణ వంటి అంశాలపై ఎంతో శ్రద్ధ వహించారన్నారు. ఆధ్యాత్మిక ఇత్యాది కార్యక్రమాల నిర్వ హణలో శాస్త్రబద్ధంగా నిర్వహించడంలో ప్రముఖ పాత్రపోషించారన్నారు. 45 సంవత్సరాల కింద ఇదే దేవాలయంలో అర్చకుడిగా విధుల్లో చేరిన కాశీనాథ్‌శర్మ ఇదే దేవాలయంలో పదవీ విరమణ పొందడం గమనా ర్హం.ఈ కార్యక్రమంలో ఆలయం పూర్వ చైర్మన్‌లు బిఎన్. శ్రీనివాస్‌రావు యాదవ్, యు.రామోహన్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి, దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచార్యులు, బాల్జీ, సురేశ్ యాదవ్, విడి.కృష్ణ, దినేష్, అభిషేక్ కెన్నడి, సురేంద్, రాకేశ్, భాస్కర్, హఫీజ్, భాగ్యలక్ష్మి, గుండ్ల గజానంద్, శివ, శ్రీను, సత్యనారాయణ, బాబురావు, లక్ష్మణ్, గణే ష్, గుర్రం శంకర్, చంద్రకళ, రవి, వంశీ, రామమూర్తి, రమణ, ఆలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధాన అర్చకుడు కాశీనాథ్‌శర్మను సత్కరించిన దృశ్యం

### పలు పనులను పరిశీలించిన కమిషనర్ ఆర్ వి కర్ణన్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్ వి కర్ణన్

**జీడిమెట్ల, మే 31, ప్రభాతవార్త**

జాతీయ రహదారి 44 నుండి చింతల వరకు వరకు చేపట్టే పైప్ లైన్ రోడ్డు వెడల్పు పనులను శనివారం కమిషనర్ ఆర్ వి కర్ణన్ పైప్ లైన్ రోడ్ స్టీల్ బ్రిడ్జి నిర్మా ణానికి స్థల పరిశీలన చేశారు. ఫాక్స్ సాగర్ నుండి కెమిక ల్ నాలకు డ్రైనేజీ డైవర్షన్ పైపు లైన్ పొడిగింపు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్, ఎస్ఎన్‌డిపిసి ఈ కోటేశ్వర రావు, జోనల్ ఎస్ఈ చిన్న రెడ్డి, లేక్స్ ఈఈ నారాయణ, డిసి టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

**ముషీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో ఒక చిరు వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముషీ రాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డి.సంతోష్ కుమార్ (42)కు మహేశ్వరంకు చెందిన స్వప్నతో 2015 లో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నా రు. సంతోష్‌కుమార్ రామ్‌నగర్ చౌరస్తాలో ఒక షాపును నడుపుతున్నాడు. గత ఇరవై రోజుల క్రితం వ్యాపార నిమిత్తం అవసరం ఉందని సంతోష్‌కుమార్ స్వప్న తండ్రి సుధాకర్‌ను రెండు లక్షల రూపాయలు అడిగి తీసుకున్నా డు. శుక్రవారం ఉదయం సంతోష్ షాపులో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని స్థానికులు సుధాకర్‌కు ఫోన్ చేయటంతో, సుధాకర్ వెంటనే షాపుకు వెళ్లి సంతోష్‌కుమార్‌ను గాంధీ హాస్పటల్‌కు తరలించారు. అప్పటికే సంతోష్‌కుమార్ మృతి చెందాడని, బహుశా ఆర్థిక ఇబ్బందుల వల్లనే సం తోష్‌కుమార్ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని కుటుం బసభ్యులు భావిస్తున్నారు. సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ముషీరాబాద్ పోలీసులు తెలిపారు.

### ఒంటరిగా ఉన్న మహిళపై దాడి

**పేట్ బషీరాబాద్, మే 31, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దేవరంజల్‌లోని ఓ ఇంట్లో.. ఒంటరిగా ఉన్న మహిళపై దాడి జరిగింది. సతీష్, ప్రమోద్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో గొలుసును లాక్కొని పారిపో యా రు. శనివారం పోలీసులు నిందితులను అరెస్టు చేసి,వారి వద్ద నుండి చోరీ చేసిన బంగారు గొలుసు (3 తులాలు), ఒక ద్విచక్ర వాహనం, చరవాణి స్వాధీనం చేసుకున్నా రు. ఇద్దరు నిందితుల్లో ఒకరైన ప్రమోద్ కుమార్ అనే వ్యక్తిపై గతంలో సైతం కిడ్నప్ కేసు ఉన్నట్లు మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో డీసీపీ కోటి రెడ్డి వివరాలు వెల్లడించారు.

### లోకమాత రాణి అహల్య బాయి దేశ మహిళలకు స్ఫూర్తిదాయకం

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:**

లోకమాత రాణి అహబ్యాయి 300 వ జయంతి ఉత్స వాల ముగింపు కార్యక్రమం శనివారం బిజెపి సికింద్రా బాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ ఆధ్వర్యం లో జరిగింది. లోకమాత రాణి అహల్య బాయి హోల్కర్ కు నివాళులు అర్పిస్తూ జరిగిన ర్యాలీ గాంధీనగర్ డివిజన్‌లోని కెనరా బ్యాంక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ మన దేశం లో ఏనో దేవాలయాలు నిర్మించిన రాణి అహల్య బాయి ఆ మహనీయురాలి మన దేశ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని, ఆమె ధైర్యం నేటి మహిళలకు నాయకత్వా నికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షు లు శ్యాంసుందర్ గౌడ్, ముషీరాబాద్ అసెంబ్లీ కార్పొరేట ర్లు సుప్రియ నవీన్ గౌడ్ ,రచన శ్రీ, పావని వినయ్ కుమార్, రవి చారి , జిల్లా బీజేవైఎం అధ్యక్షులు మద్దూరి శివాజీ, కార్యదర్శి అనిల్ కుమార్, బీజేవైఎం ముషీరా బాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ముషీరాబాద్ అసెంబ్లీ పరంగా ఉన్న డివిజన్ అధ్యక్షులు కంచి కుమార్, సాయి కృష్ణ యాదవ్, గడ్డం సతీష్, రాజశేఖర్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్వేరు సత్యనారాయణ మరియు రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు ,మహిళా మోర్చా నాయకురాలు , బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు

### మొహర్రం సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని డిజిపికి వినతి



రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేంద్రను కలిసి వినతి పత్రం అందజేస్తున్న బిజెపి మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,మే 31 ప్రభాతవార్త :** మొహర్రం సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్‌ను కలిసి పాతబస్తీ చార్మినార్ ని యోజకవర్గం దారుషిఫా ప్రాంతానికి చెందిన రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ వినతి పత్రం అందజేశారు.జూన్ నెల 27వ తేదీన మొదటి మొహర్రం ప్రారంభం అవుతుందని,జూలై ఆరవ తేదీన మొహర్రం జరగనున్నదని,మొహర్రం సంద ర్భంగా ఊరేగింపులు నిర్వహిస్తున్నందున గట్టి బందో బస్తును ఏర్పాటు చేయాలని డిజిపి డాక్టర్.జితేందర్‌కు అందజేసిన వినతి పత్రంలో ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ రెహ్మాన్ పాల్గొన్నారు.

## సింగరేణిలో సిఎండిని వేదిస్తున్న సంపత్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గవ్వల శ్రీకాంత్

**సైఫాబాద్, మే 31 ప్రభాతవార్త:** సింగరేణిలో అవినీతి, అక్రమాలుచేసి ఆనేక ఆరోపణలచే తొలగించబ డిన కార్మికుడు జి.కె.సంపత్ కుమార్ కుల అహంకారంతో సిఎండి ఎన్. బలరాం మీద కుల ఆరోపణలు చేశారని, అతనిపై కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టి సంఘం నాయకులు కోరారు. లేని పక్షంలో అన్ని సం ఘాలతో కలిసి సామూహికంగా నిరాహారదీక్షలు చేపడతామని సంఘం నాయకులు హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ సింగరేణిలో సిఎండిగా వచ్చిన ఎన్.బలరాం ఆనేక సంస్కరణలు తీసుకువచ్చి వంద శాతం సామాజిక న్యాయం చేస్తున్న అతనిపైన కక్షగట్టిన సం పత్‌కుమార్‌పై కల్పిత, అవాస్తవ ఆరోపణలతో ప్రభుత్వాలకు ఫిర్యాదు చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపించా రు. గతంలో ఆనేక మంది కార్మికుల వద్ద కోట్లాది రూపాయ లు వసూలు చేసి చివరికి చెంచల్‌గూడ జైలుపాలైన ఆయనను హైకోర్టు సైతం మందలించి 50 వేల రూపాయలు జరిమానా విధించిందని వారు గుర్తు చేశారు. అలాగే విద్యా రంగ సమ స్యలు పరిష్కారం కోసం ఆగస్టు 23,24,25 తేదీలలో సం ఘం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే ఒక కార్పోరేషన్‌ను ఏర్పా టు చేసి ఉద్యోగులను నియమించాలని, ఆర్‌టిసిలో ఔట్‌సో ర్సింగ్ పద్ధతిన కండక్టర్‌లను నియమించరాదని వారు డిమాండ్ చేశారు.

## ఉపాసన మార్గాన్ని అనుసరిస్తే అన్ని శుభఫలితాలే : హనుమంతరాయశర్మ



కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణానందపీఠం అధినేత డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ, శ్రీనివాస్‌యాదవ్, వనం ప్రసాద్ తదితరులు

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:** అమ్మవారి కీర్తనలకు విస్తృ తంగా ప్రాచుర్యం లభించాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సంగీతజ్ఞుడు, కల్యాణానందపీఠం అధినేత డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ వేదభారతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి మ హోత్సవాల సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కల్యాణా నందపీఠం అధినేత డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ రచించిన 'దేవీ వైభవం' అమ్మవారి సంకీర్తనలను సంగీతర త్న, ప్రముఖ అధ్యాత్మిక గాయకుడు యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ బృందంచే 'సంకీర్తనా మాలిక' గాన కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, వై.శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. శ్రీనివాస్‌యాదవ్ స్వర రచన చేసి సుస్వర రాగ యుక్తంగా గానం చేసి శ్రోతలను ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్యావరణ ప్రేరణ వక్త ప్రకృతి వనం ప్రసాద్ హాజరవగా, డాక్టర్ పులిగడ్డ హనుమంత రాయశర్మ ప్రధాన ప్రసంగం చేశారు. సభలో గిరిజన సంక్షేమ శాఖ పూర్వ సంచాలకులు ఓరుగంటి ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, బ్రహ్మశ్రీ వాణీవీణాపాణి శాస్త్రి, సిహెచ్‌వి.పైడేశ్వరరావు యాదవ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.రవీందర్, అంబేద్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, శ్రీ వాసవీ పర్యావరణ ప్రచార సేవాసమితి వ్యవస్థాపకురాలు జూలూరి స్వరూపారాణి వెంకటరమణ, అం తర్జాతీయ విద్యావేత్త,ఎస్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలలో భాగంగా డాక్టర్ పులిగడ్డ హనుమంతరా యశర్మ రచించిన 'దేవీ వైభవం' రచించిన కీర్తనలను యరగొ ల్ల శ్రీనివాస్‌యాదవ్ బృందంచే 'సంకీర్తనా మాలిక' పేరుతో అద్భుతంగా గానం చేశారు. పిఎంకె.గాంధీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

### యుద్ధవిమానాలు కొనుగోలులో ఫ్రాన్స్‌లోని కంపెనీతో అధిక ధరలకు ఒప్పందం

**-మోదీకి మేక్ ఇన్ ఇండియాకు, స్వాలంభనకు తేడా తెలియదు**

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఆరోపణ**

**సైఫాబాద్, మే 31 ప్రభాతవార్త:** యుద్ధవిమానాలు కొనుగోలు సమయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రతిపక్షాల అభ్యంతరాలు, సూచనలను, దేశం లోని ప్రభుత్వ రంగ సంస్థలను కాదని, ఫ్రాన్స్‌లోని యుద్ధాల తయారీ దస్సాల్ట్ కంపెనీతో అధిక ధరలకు ఒప్పందం చేసుకోవడం దేశ స్వాలంభనకు ప్రతీకగా ఉన్న హెచ్ఎఎల్‌ను కాదని రైఫేల్ ఒప్పందం చేసుకున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. పార్లమెంట్‌లోని ప్రతిపక్షం సుప్రీంకోర్టులో ఈ ఒప్పందంపై కేసు వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయంగా చెప్పి కేసులేకుండా చేశార ని విమర్శించారు. అందువల్లనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ భద్రతకోసం పాకిస్తాన్ యుద్ధంలో రాఫేల్ యుద్ధవిమా నాల పనితీరు, సమర్థత ఏమిటో తెలుసుకోవాలని కోరడటంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. రాఫేల్ యుద్ధవిమానాలు ఎన్ని పాకిస్తాన్ యుద్ధవిమానాలను కూల్చాయి?, ఎన్ని రాఫేల్ యుద్ధవిమానాలు కూల్చివేయబడ్డాయో తెలియజేయాలని అడగటంలో తప్పేముందో మోదీ తెలియజేయాలని ఆయన డి మాండ్ చేశారు. యుద్ధవిమానాల తయారీలో ఏలాంటి అను భవం లేని అనిల్ అంబానీ పేపరు కంపెనీకి రాఫేల్ ఒప్పందం ఇప్పించడం దేశద్రోహం కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియాకు, స్వాలంభనకు తేడా తెలియని మోదీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

### దోమల నివారణకు ఫాగింగ్ : కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్



గౌలిగూడలో దోమల ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి,మే 31ప్రభాతవార్త:** విపరీతంగా వృద్ధి చెందుతున్న దోమలను నివారణ కొరకు పలుసార్లుదోమల నివారణ కొరకు ఫాగింగ్ చేయడం జరుగుతుందని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు.జాంబాగ్ డివిజన్ పరిధి లోని గౌలిగూడ టెలిఫోన్ ఎక్చేంజ్,ఇడ్లీగల్లీ తదితర ప్రాంతాల్లో మలేరియా అధికారులతో కలిసి దోమల నివారణ కొరకు స్వయంగా కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ దోమలఫాగింగ్ మిషన్ పట్టుకుని ఫాగింగ్ చేశారు.ఈసందర్బంగా ఆయన మాట్లా డుతూ స్థానికులు కూడా తమపరిసర ప్రాంతాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు.ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాన్ని వేయరాద్దన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి దోమలు వృద్ధి చెందకుండా ఉంటా యన్నారు.ఈకార్యక్రమంలో మలేరియా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### డోలక్ కళాకారుడు కృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం

**జియాగూడ,మే 31ప్రభాతవార్త:** అనారోగ్యంతో భాదపడుతూ ఆకాల మరణం పొందినప్రముఖ డోలక్ కృష్ణకుటుంబానికి తె లంగాణ కురుమ సంఘం తరపున ఆర్థిక సహాయం అందచేశా రు.శనివారం జియాగూడలోని డోలక్ కృష్ణ నివాసానికి చేరుకు ని తెలంగాణ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ,సెక్రటరీ కొలుపుల నరసింహ,జంటనగరాల కురుమ సంఘం అధ్యక్షులు వినోద్‌కుమార్, కె.బుచ్చయ్య, కాలే అమర్ నాథ్‌లు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందచేశా రు.ఈకార్యక్రమంలో కురుమ సంఘం జియాగూడ ప్రతినిధులు కె.రాములు,దేవర మహేష్,డి. ఈశ్వరయ్య, శివశంకర్, హన్ మాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఒకేసారి రేషన్ కార్డుదారులకు మూడు నెలల సరుకులు

**కంటోన్మెంట్, మే 31 ప్రభాతవార్త:** ఒకేసారి మూడు నెలల (జూన్, జూలై, ఆగస్టు) సన్నబియ్యం పంపిణీ ఆదివారం ప్రారంభం అవుతున్నట్లు సికింద్రాబాద్ సర్కిల్ 9 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిణి చాముండేశ్వరి తెలిపారు. సికింద్రాబాద్ సర్కిల్ 9 పరిధిలో మొత్తం 54,471 రేషన్ కార్డులు 1,90,245 మంది లబ్దిదారులు ఉన్నట్లు తెలిపారు. సన్నబి య్య 3416.039 మెట్రిక్ టన్నులు, గోధుమలు 648.826 మెట్రిక్ టన్నులు, చక్కెర 12.771 టన్నులు పంపిణీకి సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. జూన్ నెల కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఉచితం, గోధుమలు కిలో రూ.7, చక్కెర కిలో రూ.13.50 (అంత్యోదయ కార్డుదారులు మాత్రమే) చెల్లించవ లసి ఉంటుందని తెలిపారు. మూడు నెలలకుగాను సాధారణ కార్డు కలిగిన వారికి ఒక్కొక్కరికి 6 కిలోలు చొప్పున 18 కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్న వారికి 35 కిలోలు మొత్తం 105 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున 30 కిలోలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్దిదారులు పెద్ద సంచులు తెచ్చుకోవాలని కోవిడ్ నిభందనలు పాటించాలని ఏసిఎస్ సూచించారు.

### చంద్రబాబు నాయుడిని విమర్శిస్తే ఊరుకోం

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**ముషీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసి, విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత తెలు గుదేశం జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని, అటువంటి చంద్రబా బు నాయుడిని విమర్శిస్తూ అవాకులు, చవాకులు మాట్లాడితే సహించబోమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా హెచ్చరించారు. శనివారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు జగదీశ్‌రెడ్డి తన స్థాయిని మరిచి చంద్రబాబు నాయుడిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటు న్నారని, పగటి కలలు మాని వాస్తవ పరిస్థితులలోకి రావాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకులు ఎన్నో సార్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది చంద్రబాబు నాయుడేనని ఒప్పుకుంటే, జగదీష్‌రెడ్డి కళ్లు, చెవులు మూసుకున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు బూటకపు మాట లు కట్టిపెట్టి, ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపుని చ్చారు. సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అఫ్ ది డీఫ్ (టి ఎస్ సి ఏ డి) సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అధ్యక్ష తన జరిగిన ఈ సమావేశంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ హియరింగ్ అధినేత చంద్రశేఖర్ తో కలిసి మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర, జాతీయ, ఆసియా స్థాయిలలో క్రికెట్ పోటీ లను నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ సంద ర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.చిరంజీవి, వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా జయ ప్రకాష్, సంయుక్తకార్యదర్శిగా షకీల్ ఖాన్, కోశాధికారిగా ఇమ్రాన్ తో మరో ఏడుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటామోని వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

### ఎన్.టి.ఆర్. కారణజన్ముడు : త్రినాధరావు



త్రినాథరావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:** విశ్వ విఖ్యాత నట సార్వభౌ మ డా. నందమూరి తారక రామారావు గారి 102వ జయంతి సందర్భంగా ఘంటసాల కళా వేదిక, ఎన్.టి.ఆర్. పాటలతో అద్భుత సంగీత విభావరిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన "శారదా వర పుత్ర", అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర డాక్టర్ చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ ఎన్.టి.ఆర్. కారణజన్ముడని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. నిర్వాహకులు కొండలరావు, సుబ్బారెడ్డి, భాస్క ర రావు తమ సంస్థ ఆశయాలు వివరించారు. గాయనీగా యకులు రమణి, వెంకటలక్ష్మి, ప్రసాదరావు, నంజన్న, శుభ, తదితరులు రామారావు గారి పాటలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. నిర్వాహకులు, గాయనీ గాయకులు త్రినాధరావు ను ఘనంగా సత్కరించారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే అధికారుల ఇండ్ల ముందు ధర్నా చేయిస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 31 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిష్క రించడంలో వివిధ శాఖల అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఆయా అధికారుల ఇండ్ల ముందు నియోజకవర్గం ప్రజలతో ధర్నాలు చేయిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హెచ్చరించారు. శనివారం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్ కాలనీల్లో ఆయన పర్యటిం చారు. గత కొన్ని నెలల నుంచి టీచర్స్ కాలనీ, అంబేద్కర్ నగర్‌లలో నిరంతరం డ్రైనేజీ మురుగునీరు పొంగి పొర్లుతుం దని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురొ క్కంటున్నామని స్థానికు లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన స్పందించి జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌ను అక్కడికి పిలుపించుకొని నెలల తరబడి డ్రైనేజీ మురుగునీరు ఏరులై పారుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని జిఎంను నిలదీశా రు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తే నియోజ కవర్గం ప్రజల చేత అధికారుల ఇండ్ల ముందు ధర్నా చేయి స్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు.


మాట్లాడుతున్న గిరిజన నాయకులు

## మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలి

### లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాజునాయక్

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త :** మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 శాతం ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించిందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. లంబాడీలకు న్యాయం జరగకుంటే వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ చత్తా చూపిస్తామన్నారు. సమావేశంలో గిరిజన నాయకులు భీమదేవరపల్లి మాజీ జడ్పిటిసి మాలోతు రాంచంద్రానాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, నాయకులు భీక్య కృష్ణ, మోతిలాల్‌నాయక్, తిరుపతి నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేత


లబ్దిదారులకు పత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

**హుస్నాబాద్ రూరల్(కోహెడ), మే 31, ప్రభాతవార్త :** నిజమైన అర్హులకు ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పున్న సత్తయ్య అన్నారు. శనివారం కోహెడ మండలం సముద్రాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులైన 25 మందికి గ్రామ కార్యదర్శి రేగుల తిరుపతి, పార్టీ శ్రేణులతో కలసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిజమైన లబ్దిదారులకు వచ్చే విధంగా ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ఉన్నారన్నారు. ఇళ్లడ్లకు దరఖాస్తు చేసుకుని మంజూరు కానివారు ఆందోళనకు గురికావద్దని వచ్చే రెండు నెలలలో రెండవ విడత ఇళ్లు ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. మంజూరు పత్రాలు ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు చింతకింది శంకర్, గద్దం రాజశేఖర్‌రెడ్డి, పంతంగి సత్తయ్య, పరకాల శ్రీనివాస్, యాదయ్య, రాజు, మల్లారెడ్డి, రజినికర్‌రెడ్డి ,పవన్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## కోటి లింగేశ్వరా స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, మే 31, ప్రభాతవార్త :** ఉమా పార్థివ కోటి లింగేశ్వరా స్వామి ఆశీస్సులు, దీవెనలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉమా పార్థివ కోటి లింగేశ్వరా స్వామి 46వ వార్షికోత్సవ ఉత్సవాలలో భాగంగా ఆయన శనివారం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది హరికృష్ణను శాలువాలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఈవో రవికుమార్, డైరెక్టర్లు శ్రీనివాస్, ఎల్లగౌడ్, మాధవి, అనూష, యాదగిరి, అర్చక సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీ, పూజల గోపికృష్ణ, మహిపాల్‌రెడ్డి, సాంబమూర్తి, శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన సత్తయ్యకు సన్మానం


సత్తయ్య దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో పదవీ విరమణ పొందిన సత్తయ్యను శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ భరద్వాజ్, ఎస్ఐ రవీందర్, సిఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలి

**జగదేవ్‌పూర్, మే 31 (ప్రభాతవార్త):** రైతులు సాగుచేసే భూమిలో మట్టి పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని ఐసిఏఆర్ శాస్త్రవేత్తలు ఎన్.ప్రతాప్‌రెడ్డి, శివరాంనేలు అన్నారు. శనివారం మండల పరిధిలోని వట్టిపల్లి, బస్వాపూర్ గ్రామాలలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైతులు పంట సాగుచేసే ముందు భూమి పరీక్షచేయించి భూమి లోపాల సవరణకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రసాయన ఎరువులతో భూమి నిస్సారవంతమవుతుందని, పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను వాడి రైతులు అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు.

**రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అనేక ప్రయోజనాలు**

రైతులు సంఘటితంగా ఉండి ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే అనేక లాభాలు ఉన్నాయని, రైతులు సంఘటితంగా ఉండడం వల్ల సంఘాలకు వివిధ రకాల లబ్ధి చేకూరుతుందని, పంటలకు కావాల్సిన ఎరువులు, మందులు నేరుగా కంపెనీల నుండి పొందవచ్చని తెలిపారు. రైతులు వాడే వివిధ యంత్రాలను రాయితీపై పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సిఆర్ఐడిఏ శాస్త్రవేత్త డాక్టర్ శాలిని, మండల వ్యవసాయాధికారి వసంతరావు, ఏఈఓ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.


వట్టిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

# ఉద్యోగులకు పదవీ విరమణ సహజం : ఎమ్మెల్సీ


సత్తయ్య దంరపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** ప్రభుత్వ ఉద్యోగస్తులకు పదవీ విరమణ సహజమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సానిటేషన్‌లో సబాడినేటర్‌గా పనిచేస్తున్న సత్తయ్య పదవీ విరమణ పొందడంతో పట్టణంలోని స్థానిక వైష్ణవి గార్డెన్‌లో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసిచైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎన్‌సి.రాజమౌళి, గాడిపల్లి భాస్కర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధానకార్యదర్శి నక్క రాములుగౌడ్, డాక్టర్ ఎలిశాల లింగంతోపాటు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడంలో సత్తయ్య ముందంజలో ఉన్నారన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సుమారు 35 సంవత్సరాల నుండి తన ఉద్యోగ ప్రస్థానంలో ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగాన్ని కొనసాగించారని కొనియాడారు. సత్తయ్య పదవీ విరమణ సందర్భంగా మున్సిపల్ రాష్ట్ర సెంట్రల్ ఫోరం అధ్యక్షులు జి. ప్రభాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ గోపాల్, అసోసియేషన్‌అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి రమేష్‌తో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఫోరం జిల్లా నాయకులు మధుసూదన్ తదితరులు పాల్గొని సన్మానించారు.


పీస్ కమిటి సమావేశంలో మాట్లాడుతున్న సిఐ జక్కుల హన్మంతు

## పండగలను ప్రశాంతంగా జరుపుకుందాం : సిఐ

**న్యాల్‌కల్, మే 31, ప్రభాతవార్త:** పండగను ప్రశాంతంగా జరుపుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హన్మంతు అన్నారు. శనివారం మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని పోలీసు ఠాణాలో పీస్ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఠాణా పరిధిలోని ఆయా గ్రామాల నుంచి యువకులు, కుల పెద్దలు, సంఘాల బాధ్యులు హాజరు కాగా సిఐ హన్మంతు వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పండగలను పసందుగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. త్వరలో జరిగే బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా రాజేశ్వర్ పాల్గొన్నారు.

## మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడొద్దు...

**పాపన్నపేట, మే 31, ప్రభాతవార్త :** రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడొద్దని ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ పాపారావు, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న, తునికి శాస్త్రవేత్త శ్రీనివాస్ సూచించారు. శనివారం పావన్నపేట మండలం మల్లంపేటలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మే 29 నుండి జూన్ 12 వరకు వివిధ గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నారు వేసే ముందు విత్తన శుద్ధి కోసం కార్బండిజం, వాడాలని అన్నారు. అలాగే రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలన్నారు. రసాయనిక ఎరువులు ఎకరానికి 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం,16 కిలోల పొటాషియం మాత్రమే వాడాలని సూచించారు. వరి నాబె ముందు వేర్లను జీవన ఎరువుల మిశ్రమంలో 15 నుంచి 20 నిమిషాల పాటు ముంచి నాటు వేయాలని కోరారు. వరి పంటలో అధిక దిగుబడి నిచ్చే సన్న రకాలైన కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి 5904,దొడ్డు రకాలైన జెజిఎల్ 24423,ఆర్ఎస్ఆర్ 28361, కేఎన్ఎం 118 రకాలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమాధురి ఏఇఓలుమల్లంపేట లో వికసిత కృషి సంకల్పఅభియాన్ కార్యక్రమం నిర్వహించారు.మే 29 నుండి జూన్ 12 వరకు వివిధ గ్రామాల్లో ఆవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నారు వేసే ముందు విత్తన శుద్ధి కోసం కార్బండిజం, వాడాలని అన్నారు.అలాగే రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలన్నారు. రసాయనిక ఎరువులు ఎకరానికి 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం,16 కిలోల పొటాషియం మాత్రమే వాడాలని సూచించారు. వరి నాటే ముందు పేర్లను జీవన ఎరువుల మిశ్రమంలో 15 నుంచి 20 నిమిషాల పాటు ముంచి నాటు వేయాలని కోరారు. వరి వంటలో అధిక దిగుబడి నిచ్చే సన్న రకాలైన కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి 5904,దొడ్డు రకాలైన జెజిఎల్ 24423,ఆర్ఎన్ఆర్ 28361, కేఎన్ ఎం 118 రకాలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమాధురి ఏఇఓలు జనార్ధన్, రజిత, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు,మే 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మాచాపూర్ గ్రామానికి చెందిన గాజుల బాల ఎల్లవ్వ(60) అనారోగ్యంతో సిద్దిపేటలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు ఏలేటీ రాజారెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లగా రూ.5 వేల ఆర్థిక సహాయం పంపించడంతో శనివారం బాధిత కుటుం బీకులకు అందజేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్‌నాయకులు గుర్రాల రాజారెడ్డి, బొబ్బల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గాజుల బాబు, శేఖర్‌బాబు, మల్లేశం పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి యోగ శిక్షణ..

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 31, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆదేశానుసారం జరుగుతున్న యోగ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాడు రామాయంపేట లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్లు మరియు సిబ్బందికి యోగాపై శిక్షణ ఇవ్వడం జరిగింది. యోగా శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో నిద్రలేమి మరియు ఆగ్రహావేశాల నియంత్రణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి మరియు సిబ్బంది పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న వైద్య సిబ్బంది


సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఉపాధి సమాజిక తనిఖీపై అవగాహన

**సిర్గాపూర్, మే 31, ప్రభాతవార్త:** ఉపాధి హామి పనులపై నిర్వహించే 4వ విడత సామాజిక తనిఖీని పురష్కరించుకుని శనివారం ఉపాహి హామి సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వమించారు. 1 ఏప్రిల్2024 నుంచి 31 మార్చి 2025 వరకు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ తెలిపా మల్సూంగ్‌నాయక్ తెలిపారు. జూన్ 1వ తారీఖు నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించాలని, అందుకు పాటించాల్సిన పద్దతులు, జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిఓ, ఏపిఓ, ఏపిఎం, ఇంజనీర్ కనసల్టెంట్, సోషల్ ఆడిట్ బృంధం తదితరులు పాల్గొన్నారు.

## తెరుచుకోని పబ్లిక్ టాయిలెట్‌లు

### మహిళలకు అవస్థలుపడుతున్న మహిళలు



సదాశివపేటలో వృధాగా ఉన్న పబ్లిక్ టాయిలెట్ దృశ్యం

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** బహిరంగ ప్రదేశాల్లో మూత్ర, మల విసర్జనతో ప్రాంతాల పరిశుభ్రత దెబ్బతుంటుందన్న ఉద్దేశంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్వాహణకు నోచుకోక పట్టణంలో అలంకార ప్రాయంగా మారాయి. పబ్లిక్ టాయిలెట్‌ల నిర్వహణకు కొందరికి బాధ్యతలు అప్పగించి వారికి వ్యాపారాలు చేసుకునేందుకు కొంత స్థలాన్ని సైతం కేటాయించారు. బాధ్యతలు పొందిన వారు తమ వ్యాపారాలను అయితే సవ్యంగా చేసుకుంటున్నారు కాని పబ్లిక్ టాయిలెట్‌ల నిర్వాహణను మాత్రం మరిచిపోయారు. పబ్లిక్ టాయిలెట్‌ల తలుపులు తెరుచుకోకపోతుండటంతో ప్రధానంగా మహిళలు పడుతున్న పట్లు చెప్పనలవిగా ఉన్నాయిన ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.సంబంధిత అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్‌లు ఉపయోగంలోకి వచ్చేల చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎంపిడిఓ రాజశేఖర్ పదవీ విరమణ

**న్యాల్‌కల్, మే 31, ప్రభాతవార్త:** ఎంపిడిఓగా విధులు నిర్వహించిన కవలాస్ రాజశేఖర్ శనివారం పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ పొందిన రాజశేఖర్‌ను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ దంపతులను అధికారులు, నాయకులు శాలువా పూలమాలలతో సత్కరించి జ్ఞాపికనలు అందచేసి వీడ్కోల పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, మాజీ ఎంపిపి వైస్ చైర్మన్ గౌసొద్దిన్, మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శాంత్‌కుమార్‌పాటిల్ పాల్గొన్నారు.


రాజశేఖర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

# ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం ప్రారంభం


ఘనంగా జాతరను ప్రారంభించిన దృశ్యం

**గుమ్మడిదల మే 31(ప్రభాతవార్త) :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లిలో నూతనంగా నిర్మాణం చేపట్టి ఎల్లమ్మ పోచమ్మ చిత్తారమ్మ నాగ దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్బంగా దేవాలయ కమిటీ గ్రామ అధ్యక్షుడు కావలి శంకర్ మాట్లాడుతూ మే 31వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి గణపతి పూజ, పుణ్యవచనము, పంచగవ్య ప్రాసన, రుత్విక్ వరణము, అఖండ దీపారాధన, స్థాపన, అగ్ని ప్రతిష్ట మండపారాధన గణపతి హోమం విగ్రహాల ఊరేగింపు సాయంకాలం ప్రదోష పూజ జలాధి వాసం తీర్థప్రసాదాల వితరణ, జూన్ 1వ తేదీ ఆదివారం జేష్ట శుద్ధ షష్టి ఉదయం 8 గంటలకు ఆవాహిత దేవత పూజమహాస్థాపనము అభిషేకం, సాయంకాలం ప్రదోష పూజ దాన్యాధివాసం ఫలాది వాసం పుష్పాదివాసం షయాదివాసం ఆదివాసాల తదుపరి తీర్థప్రసాదాల వితరణం జూన్ 2 సోమవారం నజేష్టశుద్ధ సప్తమి ఉదయం ఎనిమిది గంటల ఆరు నిమిషములకు అవాహిత దేవత మూలమంత్ర భవనము ఘర్త సంస్కారము యంత్ర ప్రతిష్ట తదుపరి మూర్తి స్థాపన శిఖర ప్రతిష్ట బలిపూర్ణహుతి కలశాద్వాసనము మహదాశిర్వచనం తదుపరి తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం జరపబడునని కావలి శంకర్ తెలిపారు. భారీఎత్తున ప్రజలు భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, వండబోయిన లక్ష్మీ మ్మనారాయణ, సుంకరి శంకర్, శ్రీ చూర్ణం చక్రపాణి, ఎండి ఆజాం, గవ్వల అనిల్, ముద్దంగుల గోపాల్, బిక్షపతిరెడ్డి, ఉప్పరి వీర స్వామి, తలారి రాజు, చాకలి రాములు, గ్యారాల మల్లేష్, అమ్మగారి శేఖర్ శిల్పావధాని నందన్ తదితరులు పాల్గొన్నారు.


చాట్లపల్లిలో బీరప్ప దేవాలయ నిర్మాణానికి భూమిపూజచేస్తున్న దృశ్యం

## బీరప్ప దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

**జగదేవ్‌పూర్, మే 31 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో శనివారం కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామ కురుమ కులస్తులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్బంగా కొంత మంది కుల పెద్దలు మాట్లాడుతూ మా కుల ఆరాధ్య దైవమైన బీరప్పస్వామి దేవాలయం పూర్వకాలంలో నిర్మించినది కావడంతో నూతన దేవాలయ నిర్మాణానికి కురుమ కుల సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించడం జరిగిందని, గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని బీరప్ప దేవాలయంలో పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కుల పెద్దమనిషి చంద్రయ్య, కులస్తులు భూమల్ల మల్లయ్య, బీరయ్య, నర్సింలు, భూమల్ల లింగం, చెట్కూరి మల్లయ్య, బోగర్ల కనకయ్య, నక్క కనకయ్య, భూమల్ల స్వామి, మాసూరి తిరుపతి, బి.రాజు, బి.కనకయ్య, అనిల్, భూమల్ల మల్లేశం, రాజు, మాసూరి బిక్షపతి, తిరుపతి, బోగర్ల కొండమల్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులకు చెక్కుల పంపిణీ

**కోహెడ, మే 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నంగునూర్ మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడెం సారయ్య, బందోజు గణేష్‌లు మృతి చెందిన విషయం తెలిసిందే!. దీంతో మాజీ సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబీకులకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబుల చేతుల మీదుగా శనివారం రూ.5 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎవో

**టేక్మాల్, మే 31, ప్రభాతవార్త:** మండలపరిధిలోని బొడ్మట్‌పల్లి, టేక్మాల్ లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసు శాఖ సంయుక్త తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్బంగా టేక్మాల్ మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా ఉంచుతామని, తనిఖీలు చేసి పట్టుపడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మాలని, రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దన్నారు. దుకాణం ఎదుట స్టాక్, ధరలు, విత్తనాల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని తెలిపారు. విత్తనాలు అమ్మకం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పంటలపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన

**కంగ్టి, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని భీంరా గ్రామ పంచాయతీ తేనకరవాడగావ్ గ్రామాల్లో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వానాకాలంలో రైతులు సాగు చేసే పంటలపై యాజమాన్య పద్దతులపై జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) శాస్త్రవేత్త అవగాహ కల్పించారు. అభియాన్ ప్రాముఖ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై రైతులు శాస్త్రవేత్త డాక్టర్ సాయి ప్రియాంక అవగాహన కల్పించారు. రైతులకు పిఎం కిసాన్, రైతు భరోసా, పీఎం ఫసల్ భీమా యోజన, వ్యవసాయ పరికరాల సబ్సిడీల తదితర అంశాలపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి హరీస్ పవర్ మాట్లాడుతూ వ్యవసాయ ఇన్‌పుట్ కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. లైసెన్సు కల్గిన డీలర్ల వద్దనే ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన రశీదులను పంట చేతికి వచ్చే వరకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఇండియన్ ఇన్ఫిట్యూట్ ఆఫమిలెట్ రీసెర్చ్ డాక్టర్ అరుణ జొన్న పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఆర్గనైజేషన్ బాధ్యులు రవిప్రసాద్, కెవికె శాస్త్రవేత్తలు, జగన్మోహన్‌రెడ్డి, ఏఈఓస్ ఎండి షరీఫ్, సంతోష్, నరేందర్, వాటర్ షెడ్ సిబ్బంది సుధాకర్, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాహిత్య సమాచార పత్రాలను పంపిణి చేశారు.

## జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

**కంగ్టి, మే 31, ప్రభాతవార్త:** జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండలంలోని ఆయాగ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులకు ఏవైన భూ సమస్యలు ఉంటే రెవిన్యూ సదస్సులో పరిష్కరించుకునేందుకు సబంధిత ఆధారాలతో రెవిన్యూ సదస్సులో అర్జీలు అందచేయాలని సూచించారు.

## జూన్ 2 నుంచి స్లాట్ బుక్కింగ్ షురూ

**కంది, మే 31, ప్రభాతవార్త:**

జూన్ 2వ తేదీ నుంచి స్లాట్ బుక్కింగ్‌ను ప్రవేశపెడుతున్నట్టు డిఆర్ఓ వల్లి సుబ్బలక్ష్మి తెలిపారు. సంగారెడ్డి, పటాన్ చెరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక సబ్ రిజిస్టార్ అధికారికి 48 స్లాట్‌లు, పటాన్‌చెరులో ముగ్గురు సబ్ రిజిస్టార్‌లకు 48 చొప్పున స్లాట్‌లు కేటాయించామన్నారు.

## హద్నూర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు


తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న కిష్టన్న

**న్యాల్‌కల్, మే 31, ప్రభాతవార్త:** నెలల తరబడి పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు పాలవుతున్న తాగునీరు వృధా కాకుండా పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ సూచనల మేరకు మెకానిక్ శనివారం మరమ్మతులు చేశారు.వార్డులో కాలనీ ప్రజలకు సరఫరా అయ్యే తాగునీరు లీకై రోడ్డుపై ప్రవహిస్తూ ఉండటంతో అటుగా ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కాలనీలోని ఓ వీధి వృధాగా తాగునీరు పారుతుంటంతో బురదమయంగా మారి పోయింది. కాలనీ వాసులు వినతి మేరకు పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ న్యాల్‌కల్ నుంచి మెకానిక్‌ను రప్పించి లీకే.ఈ సమస్యను పరిష్కరించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన వారు కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్స అందుకునేందుకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. సదాశివపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 22 మందికి, పట్టణంలోని 12 మందికి 9లక్షల 6వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గడిల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు అల్లం లలిత, కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, శమీ, నసీర్, మోబిన్ జున్ను కలీం పటేల్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, సిద్దన్న, మాణిక్ నరేష్ గౌడ్, రాములు, నాయకులు నగేష్, రవి, గణేష్, సాయి వాదోని శేఖర్, రాధకృష్ణ, ప్రసాద్‌గౌడ్, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



అహల్యాబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఘనంగా అహల్యాబాయి జయంతి వేడుకలు

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ముగింపు ఉత్సవాలను గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు విద్యార్థులకు అహిల్యాబాయి జీవిత చరిత్రపై ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు అధ్యక్షత వహించగా చిన్మయ మిషన్ స్వామి యజ్ఞానంద ముఖ్య అతిథిగా, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర మహిళా కన్వీనర్ కారెడ్ల రుక్మిణి ముఖ్య వక్తగా, మహిళా సహ కన్వీనర్ నందాదేవిలు హాజరు కాగా ఉష్మశ్రీ, హరిణ పవన్, సావిత్రిలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నాగేందర్, కార్యకర్తలు సందీప్, అరవింద్, పీఈటి నాగేష్, రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట,మే 31, ప్రభాతవార్త:** మండల పరిధి కామారం గ్రామంలో శనివారం మల్లారెడ్డి ఆసుపత్రి వారి సౌజన్యంతో సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచి గఢీల హేమలత సుధాకర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 200 మంది వరకు గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు శివ నాయక్, మాజీ సర్పంచి హేమలత సుధాకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి ఆసుపత్రి సిబ్బంది రవి కుమార్, భాను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

**హవేళీఘణపూర్, మే 31, ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సింధు రేణుక తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ జూన్ 3వ తేది నుండి 20వ తేది వరకు ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ సందేహాలను, సమస్యలను సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇంటి పట్టాల పంపిణీ



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాలను పంపిణి చేస్తున్న గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోహీర్ మండలం పిచేర్యాగడి, జహీరాబాద్ మండలం ఆనెగుంట, మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామాల్లో శనివారం సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఇందిర్మి ఇంటి లబ్దిదారులకు పట్టాలను పంపిణి చేసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వ హించి ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంది రమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవనీతికి ఆస్కారంలేకుండా అర్హులైనవారికి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందచేస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, ఆయా మండలాల ఎంపిడిఓలు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు, సిడిసి చైర్మన్ మాజీ మున్సిపల్ చైర్మన్‌లు, మాజీ ఎంపిపి అధ్యక్షులు పాల్గొన్నారు.

## సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



కామారం తండాలో పూజలు నిర్వహిస్తున్న ప్రేమ్‌సింగ్ మహరాజ్

**చిన్నశంకరంపేట, మే 31, ప్రభాతవార్త:** సేవాలాల్ సూర్పితో బంజారాలు ముందుకు సాగాలని దీక్ష గురువు రామారావు మహారాజ్ శిష్యుడైన ప్రేమ్‌సింగ్ మహారాజ్ అన్నారు. శనివారం మండల పరిధి కామారం గోప్య తండాలోని సేవాలాల్ గుడి వద్ద భోగ్ బంగారి కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, స్వామి, బిమ్లానాయక్, వెంకటేష్‌నాయక్, నరేష్‌నాయక్, కుమార్‌నాయక్, పూనా సింగ్, శ్రీనివాస, గోప్యానాయక్, రవినాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు : ఎక్సైజ్ ఎస్ఐ

**నర్సాపూర్ మే 31,ప్రభాతవార్త:** పొగాకు గుట్కా పాన్‌మసాలా నిషేధత మాదకద్రవ్యాలను ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేంద్రరావు హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ కోర్టులో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేంద్రరావు, నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్‌లు పాల్గొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వారా మాదకద్రవ్యాల నిషేధిత కోసం కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతరం పొగాకు గుట్కా పాన్ మసాలా వంటి మాదకద్రవ్యాలను తీసుకొని ప్రాణాంతక వ్యాధులకు గురికావద్దన్నారు. ఈ వ్యాధులకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రాణాంతక మాదకద్రవ్యాల జోలికి యువత గురికా వద్దని వారు సూచించారు. ఎవరైనా నిషేధిత మాదకద్రవ్యాలను అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులై నిర్మూలించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాది స్వరూప రాణి, సీనియర్ న్యాయవాది ఏ శ్రీనివాస్, రవినాయక్, ఏపీఎం గౌరీ శంకర్ సంగమేశ్వర్, ఏపీవో అంజిరెడ్డి, జూనియర్ సివిల్ కోర్ట్ తాత్కాలిక సూపరెండెంట్ రమేష్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ టైపిస్ట్ కం అసిస్టెంట్ అంజయ్య, లీగల్ సర్వీస్ సిబ్బంది కోర్టు సిబ్బంది అరుణ, స్టెనో అరుణ, జ్ఞానేశ్వర్, షేక్ హాజీ పాషా, మమతా, సుకన్య, శ్రీకళ పాల్గొన్నారు.

### బొల్లారం మున్సిపల్ పరిధిలో శాంతి కమిటీ సమావేశం

**హవేళీఘణపూర్, మే 31, ప్రభాతవార్త:** బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రవీందర్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా బొల్లారం మున్సిపల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, బక్రీద్‌పండుగను శాంతియుతంగా, నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా పూర్తి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బొల్లారం మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి మాట్లాడుతూ పండగలను సామరస్యంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు దశరథ, కృష్ణరెడ్డి, పోలీస్ సిబ్బంది, బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ది పనుల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త**

అంబర్ పేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ది పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలో డిసిపి ఆఫీస్ ఎదురుగా ఉన్న బస్తీలో రూ.20 లక్షలతో నూతన సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు..అనంతరం ఎమ్మెల్యే కాలేరు బస్తీలోని గల్లి గల్లి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో మంజూరైన పనులను దశలవారిగా ప్రారంభిస్తామన్నారు. గోల్నాక డివిజన్‌లో అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సదర్ కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నల్లకుంట డివిజన్ పరిధిలో న్యూనల్లకుంట,బ్రహ్మణ



గోల్నాకలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్, బాయమ్మగల్లి నుంచి తిలక్‌నగర్ రోడ్డు వరకు 1.40కోట్లతో సిసి రోడ్డుకు పనులు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. త్వరలో ఈ పనులను ప్రారంభించి నల్లకుంట డివిజన్‌లోని ప్రధాన రోడ్డు మొత్తం సిసి రోడ్డుతో ఆధునీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, యు.సోమిరెడ్డి, ఎస్.రాములు, బి.కె.రామ లక్ష్మి, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, ఈ.సుధాకర్‌రెడ్డి,, భచన్, జనార్ధన్, సంతోష్, సంతోష్,సురేష్‌గౌడ్, నర్సింగ్‌యాదవ్ తదితర బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిగిసిన 58వ అఖిల భారత యౌవనస్థుల కూటముల సభలు

**చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త:**

గోల్కొండ క్రాస్ రోడ్డులోని ప్రసిద్ధి చెందిన హెబ్రోను చర్చిలో హెబ్రోను సొసైటీ, ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 58వ అఖిల భారత యౌవనస్థుల కూటములు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా హెబ్రో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధి ఆర్. వీరచారి మాట్లాడారు. ఆలిండియా యూత్ క్యాంపుకు దేశవ్యాప్తంగా క్రైస్తవ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. హాజరైన ప్రతీ ఒక్కరికి మెరుగైన సౌకర్యాలతోపాటు భోజన, వసతిని కల్పించామన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా తిరుపతికి చెందిన బ్రదర్ జయరాజు వాక్యోపదేశం చేశారు. సింగపూర్ నుంచి వచ్చిన బ్రదర్ ఐజియా తిమోతి యువత సన్మార్గంలో నడుచుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. క్రైస్తవం మతం కాదని, యేసు క్రీస్తు బోధనలు అనుసరనీయమన్నా రు. కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం హెబ్రోను చర్చి పరిసరాల్లో సువార్త ర్యాలీని నిర్వహించారు. కూటములు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, పోలీసులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ, ట్రస్టులకు చెందిన ప్రతినిధులు జానుందర్రావు, స్టీఫెన్ చిన్నప్ప, ఎం. ఇమ్మానుయేలు, ఆనంద్రరాజు, వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న హెబ్రోన్ చర్చ్ సొసైటీ ప్రతినిధి ఆర్. వీరచారి

### ఘనంగా అప్స వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు



వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రచనశ్రీ

**ముషీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** అప్స స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని బండనగర్ కమ్యూనిటీహాల్ నందు నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ రచనశ్రీ హాజరై అప్స మరియు సర్వ్‌నీడీ స్వచ్ఛంధ సంస్థలు పేద, మధ్య తరగతి వారికి చేస్తున్న సేవా కార్యక్రమాలని కొనియాడారు. వేసవి కాలంలో పిల్లలలో నైపుణ్యాన్ని వెలికి తీయటానికి, ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని, అదే విధంగా పిల్లలు మొబైల్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ్‌నీడి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గౌతం, హిమాయత్‌గనర్ సబ్ పోస్ట్ మాస్టర్ సురేష్ గౌడ్, అప్స కోఆర్డినేటర్ బొట్టు రమేష్, సంస్థ ప్రతినిధులు శ్రావణి, లావణ్య, మంగ, స్థానిక బీజేపీ నాయకులు వెంకటేష్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## సూరారం పిఎస్‌లో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదు..



ఫిర్యాదు చేసిన అపార్ట్‌మెంట్ వాసులు

**జీడిమెట్ల, మే 31, ప్రభాతవార్త**

సూరారం పిఎస్ పరిధిలో మొట్కానిగూడ మోడి ఎలిగ్నిసి అపార్ట్మెంట్ గేటడ్ కమ్యూనిటీలో దొంగతనం జరిగింది. ఈ విషయంపై అపార్ట్మెంట్ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని సి.సి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమకు మోడి ఎలిగ్నిసి అపార్ట్మెంట్ గేటడ్ కమ్యూనిటీలో నెల నెల మెయిన్టనెన్స్ పేరుతో డబ్బులు తీసుకుంటూ ఎలాంటి సౌకర్యాలు అనగా సి.సి కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది, శానిటరీలాంటివి కల్పించడం లేదని బిల్డర్ సౌరభ్ మోడి, నిర్వాహకులు అశోక్ పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని అపార్ట్మెంట్ వాసులు సూరారం పోలీసులకి ఫిర్యాదు చేశారు.

### టిజిపిసిబి జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ సత్యనారాయణ రావు పదవీ విరమణ




డాక్టర్ ఎం సత్యనారాయణ రావును జ్ఞాపిక మరియు శాలువాతో సత్కరిస్తున్న బోర్డు సభ్య కార్యదర్శి జి రవి

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త:** తెలంగాణ కాలుష్యని యంత్రణ మండలి(టిజిపిసిబి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. సత్యనారాయణ రావు పదవీ విరమణ సభ శనివారం జరిగింది. బోర్డు ఆవరణలో ఏర్పటు చేసిన కార్యక్రమలో సభ్య కార్యదర్శి జి.రవి మాట్లాడుతూ సత్యనారాయణ రావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన రిటైర్మెంట్ జీవితం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సంస్థకు ఆయన 36 సంవత్సరాలు అంకితభావంతో చేసిన సేవలను ప్రశంసించారు. సత్యనారాయణ మాదిరిగా ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేయాలని సూచించారు.తనకు సహకరించినందుకు అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టిజిపిసిబి అధికారులు మరియు సహచరులు ఆయన పదవీకాలంలో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. సిబ్బంది, అధికారులు శాలువా మరియు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి. రఘు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,మే 31 ప్రభాతవార్త:** పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ సూచించారు. శ్రీగణేష్ పౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మోండా డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో పేద విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని వివిధ మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద పిల్లల విద్యకు అవసరమైన నోటు పుస్తకాలు,పెన్నులు, బ్యాగ్‌లు, బూట్లు తదితర వస్తువులను స్వచ్ఛంద సంస్థల ద్వారా అందజేయిస్తామన్నారు. అదే విధంగా తన శక్తి మేరకు ఎస్.జి.ఎఫ్. సంస్థ ద్వారా కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, నర్సింగరావ్, బాబురావ్, రౌతు రాజయ్య, పంగ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను కౌంటర్లను ఏర్పాటు చేయడం అభినందనీయం : తేలుకుంట



5వ వార్డు వాసవి నగర్‌లో ఆస్థపన్ను కౌంటర్‌ను ఏర్పాటు చేసిన కంటోన్మెంట్ బోర్డు

**కంటోన్మెంట్,మే 31 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ వార్డులలో జనవాసాల మధ్య ఆస్థి పన్ను వసూళ్ల కోసం కౌంటర్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో యుద్ధ కారణాలతో ఈ చావని, టోల్ ఫ్రీ సర్వీస్‌లను నిలిపి వేయడంతో అంతరాయం ఏర్పడింది. తేలుకుంట సతీష్ గుప్త విజ్ఞప్తి మేరకు బోర్డు సిఈఓ స్పందించి శనివారం వాసవి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కౌంటర్‌ను ఏర్పాటు చేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### అడ్డగుట్టలో యాభై పడకల ఆసుపత్రిని నిర్మించాలి : సిపిఎం



అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

**అడ్డగుట్ట,మే 31 ప్రభాతవార్త:** దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో యాభై పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా పనులు జరగడం లేదని సిపిఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబు ఆరోపించారు. ప్రభుత్వాలు మారిన, ప్రజా ప్రతినిధులు మారిన అడ్డగుట్టలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి అడ్డగుట్టలో యాభై పడకల ఆసుపత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

### రిటైర్డ్ అధికారులకు పనేంటి? : ఆకుల సతీశ్

**జీడిమెట్ల, మే 31, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ పరిధిలో 10 ఏళ్ల క్రితం రిటైర్డ్ అయిన ఇరిగేషన్ మాజీ ఏఈ శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ పర్యటనలో పాల్గొనటం ఏంటని బీజేపీ నేత ఆకుల సతీష్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను విధుల నుంచి తొలగించారన్నారు. గతంలో జరిగిన అవినీతిపై కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లిన మీడియాపై ఆయన దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు.

## సంస్కృతి సంప్రదాయాలకు నెలవు హిందూ జీవనవిధానం : నటుడు సుమన్

**రవీంద్రభారతి, మే 31 ప్రభాతవార్త :**

హిందై జీవనవిధానం సంస్కృతి, కళలు, సంప్రదాయాల మేళవింపు, నెలవని ప్రముఖ సినీనటుడు డా. సుమన్ తల్వార్ అన్నారు. జీవిత పరమార్థమైన శాంతి సామరస్యాలు, అనురాగ బాంధవ్యాలను నెలకొల్పేవి, పరిరక్షించేవి సంగీత సాహిత్య కళలేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాప కురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీల నిర్వహణలో, లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో ప్రఖ్యాత గాయిని, సంగీత గురువు పద్మజ విశ్వాస్ జనపథం-జానపదం సంగీత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుమన్ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర జైళ్ల సంక్షేమశాఖల డైరెక్టర్ జనరల్ డా. సౌమ్యమిశ్రా, ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మతో కలిసి సంగీతగురువు పద్మజ విశ్వాస్‌ను ఘనంగా సత్కరించి నవకళ తరంగిణి బిరుదు ప్రదానం చేసి ప్రసంగించారు. సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ భారతదేశంలో అనాధిగా హిందూ ధర్మం విరాజి ల్లుతోందని, భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడమే మన ప్రథమకర్తవ్యం ధర్మమని స్పష్టం చేశారు. సభకుముందు పద్మజ విశ్వాస్ నిర్వహించినజనపథం-జానపదం సంగీత కార్యక్రమంలో ఆమె అన్నమయ్యకీర్తనలు, పలు అద్భుత జానపద గేయాలను సుమధురంగా ఆలపించి తరాల అంతాలను రాగాలతో మేళవించి సంగీత వారసత్వాన్ని కొనసాగించారు. బుర్ర మోహన్‌కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



పద్మజవిశ్వాస్‌ను నవకళ తరంగిణి బిరుదుతో సన్మానిస్తున్న సుమన్, సౌమ్యామిశ్ర, సంధ్యారాణి, రఘుశ్రీ, ఓలేటి

## ఆస్తిపన్ను వసూళ్లపైనే కాదు అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలి

**- బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**

**నార్సింగి, మే 31 ప్రభాతవార్త :** అధికారులూ... ఆస్థి పన్ను వసూళ్లపైనే కాదు, మున్సిపల్ అభివృద్ధిపైనా, ప్రజల సమస్యల పరిష్కారంపైనా దృష్టి పెట్టాలని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ పరిధిలోని సుందర్‌గార్డెన్ ప్రాంతంలో బిఆర్ఎస్ నేతల బృందం గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సీతారాం ధూళిపాళ, బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ అధికారుల పాలనలో మణికొండ మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకున్న పాలకవర్గ సభ్యుల గడువు ముగిసిన తరువాత ప్రజల సమస్యలపై స్పందించే నాథుడే కరువ య్యాడన్నారు. అధికారులు ఏసీ కార్యాలయాల్లో కూర్చొని పేపర్ వర్క్ చేస్తే సరిపోదని, కాలనీలు, బస్తీలలో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారాచూసి, వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులనుంచి జీతాలు పొందుతున్నామన్న వాస్తవంను అధికారులు అనుక్షణం గుర్తుచుకొని విధులు నిర్వహిం చాలని హితవు పలికారు. ప్రజలకు అధికారులు సేవకులని, వారిచ్చే డబ్బుల నుంచే జీతాలు తీసుకుంటున్నారన్నారు.పెరిగిన జనాభా కారణంగా పాత డ్రైనేజీ పైపుల సామర్థ్యం తగ్గిపోయి, డ్రైనేజి నీరు ఎక్కడికక్కడ రోడ్లపై పొంగుతుందన్నారు. పెద్ద పైప్‌లైన్ వేసి డ్రైనేజి వ్యవస్థను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. బహిరంగ మూత్ర విసర్జనను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్ల నిర్మాణం సమయంలో అధికారులు తనిఖీలు చేయకుండా, అలసత్వం వహించడంవల్ల వేసిన మూన్నాళ్లకే కంకర తేలి, గోతులు పడి వావహనదారులకు నరకం చూపిస్తున్నాయన్నారు. ఇంజనీరింగ్ శాఖకు సంబంధించిన అధికారుల అసమర్థత కారణంగా ప్రజలు బాధలు పడుతున్నా రని తెలిపారు. ప్రజల సమస్యల పట్ల అలసత్వం వహి స్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలుచేస్తామని బిఆర్ఎస్ ప్రతినిధులు హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాంత్, సుమ నళిని, హరి, చెరుకూరి బాలాజి, భానుచందర్, ఆరిఫ్, యాలాల కిరణ్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



మణికొండ సుందర్‌గార్డెన్ ప్రాంతంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం

## 111మంది బౌద్ధ ఉపాసకులు ఉపాసికులకు బుద్ధ విగ్రహాల పంపిణీ




బుద్ధవిగ్రహాల స్వీకర్తలతో గగన్‌మాలిక్, కె.కె.రాజా తదితర ప్రముఖులు

**నాంపల్లి, మే 31 ప్రభాతవార్త :**

గగన్‌మాలిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లత ఫౌండేషన్ నిర్వహణలో బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజ రావు కళావేదికలో ఉచితంగా ప్రముఖ బౌద్ధ ఉపాసకులు, ఉపాసికులకు కాంస్య బుద్ధ విగ్రహాల పంపిణీ కావించారు. బుద్ధ భగవానుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్, మహాత్మ జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ డా. బి.ఆర్.అంబేద్కర్,రాజమాత ఆహియాబాయ్ హోల్కర్ సంస్మరణార్థం, భారత రాజ్యాంగ అమృత మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా బుద్ధిజంను ప్రచారం చేస్తున్న 111మంది బౌద్ధ ఉపాసకులు, ఉపాసికులను సంస్థ వ్యవస్థాపకుడు ప్రఖ్యాత బుద్ధిష్టు గగన్‌మాలిక్, లతరాజా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కె.రాజా చేతులమీదుగా ఘనంగా సత్కరించి బుద్ధుడి కాంస్య విగ్రహాలను పంపి ణీచేసి ఎంతగానో అభినందించి వారి విశేష సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గగన్‌మాలిక్ ఫౌండేషన్ చేస్తున్న నిర్విరామ సేవలను సవివరపరిచారు.

### సెట్విన్ కార్యకలాపాల విస్తరణకు ఏర్పాట్లు :

**సికింద్రాబాద్, మే 31 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ లోని సెట్విన్ కేంద్రం కార్యకలాపాలను విస్తరించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మా రావు గౌడ్ తెలిపారు. సితాఫలమండీలోని సెట్విన్ కేంద్రంలో నిర్మిస్తున్న కొత్త భవనాల నిర్మాణం పనులను పద్మారావుగౌడ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగాచేపట్టిన నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గత దశాబ్ద కాలంలో సెట్విన్ ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతుల విద్యార్థులకు శిక్షణను కల్పించి ఉపాధిని ఏర్పరి చామని, మరిన్ని కొత్త కోర్సులను ప్రారంభించేందుకు వీలుగా అదనం గా వసతిని కల్పించేందుకు భవనాలను నిర్మిస్తున్నామని పద్మారావుగౌడ్ తెలిపారు.నిర్మాణం పనుల్లో నాణ్యతను పాటించాలని, వివిధ కోర్సుల నిర్వహణకు వీలుగా భవన సముదాయాన్ని నిర్మించాలని పద్మా రావు గౌడ్ సూచించారు. కొత్తగా మరో రెండుఅంతస్తులను సెట్విన్ కార్యకలాపాలకే కేటాయించనున్నట్లు తెలిపారు. సెట్విన్ సెంటర్ ఇంచార్జ్ అనిత పాల్గొన్నారు.

## ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

### రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

**చార్మినార్,మే 31 ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించటానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా శనివారం పాతనగర మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు హైదరాబాద్ నగర ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలకు ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు జి.రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి కె.గురునాథ్ రెడ్డి,కార్యదర్శులు మాణిక్ ప్రభుగౌడ్,శ్రీకాంత్‌తోపాటు పాతబస్తీలోని పలు దేవాలయాల కమిటిల ప్రతినిధులు మారుతి యాదవ్,జగన్మోహన్ కపూర్,జె.మధుసూధన్ గౌడ్,ఎ.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లోని లేక్‌ల సుందరీకరణకు చర్యలు :

**కంటోన్మెంట్,మే 31 ప్రభాతవార్త:** భవిష్యత్తు తరాలకు బోయిన్‌పల్లి రామన్నకుంట చెరువు సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం హెచ్ఎండిఏ, ఇరిగేషన్ అధికారులతో కలిసి బోయినపల్లిలోని రామన్నకుంట చెరువును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ బోయిన్‌పల్లి రామన్నకుంట చెరువు, తిరుమలగిరి లేక్‌ల సుందరీకరణకు ప్రత్యేక నిధులు విడుదల చేసేం దుకు సిఎం రేవంత్‌రెడ్డి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. చెరువులను సుందరీకరణ చేస్తే నియోజకవర్గం ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అదే విధంగాలేక్‌లో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్, వాటర్ పాల్స్, మురుగునీరు శుద్ధికరణ ఏర్పాటు చేస్తామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో లేక్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని హంగు అర్భాటాలు చేశారు కానీ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

**నర్సాపూర్ మే 31, ప్రభాతవార్త:** వేలాడుతున్న విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తున విద్యుత్ షాక్ తగిలి మూడు గేదెలు ఒక కుక్క షాక్ గురై బలైన సంఘటన నర్సాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం జరి గింది. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే... ఇటీవల కురిసిన గాలి వాన బీభత్సానికి గొల్లపల్లి గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నివిద్యుత్ స్థంబాలు వంగిపోయి తీగెలు వేలాడాయి. ఈ మేరకు విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు వేలాడుతుండగా ప్రమా దం పొంచి ఉన్నది. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన చాకలి భాషయ్య రెండు గేదలు. ఒగ్గు రాములు కు చెందిన ఒక గేదే. ఒక పెంపుడు కుక్క వేలాడుతున్న విద్యుత్ తీగల వద్ద మేత మేసుకుంటూ పోయి ప్రమాదవశాత్తు నా తీగలకు తగలగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే3 గేదెలు, ఒక కుక్క మృతి చెందాయి. దీంతో బాధితులు గేదెలు మృతి చెందడంతో బాధతో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదం విద్యుత్ అధికారుల నిరక్ష్యమే కారణమని బాధితులు ఆరోపించారు. ఒక నెల రోజులుగా కింద పడ్డ విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయకుండా విద్యుత్ అధికారులు నిరక్ష్యం చేశారని అలాగే వదిలివేశారని మండిపడ్డారు. దీంతో తమకున్న మూగ జీవాలు మృత్యువాత పడగా తాము ఎంతగానో నష్టపోయామని తమకు ప్రభుత్వం తరఫున విద్యుత్ అధికారుల తరఫున ఆర్థిక సహాయాన్ని అందించి మమ్ములను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.